# ఇండియన్ పాలిటీ

## షెడ్యూల్డ్ కులాలు – సంక్షేమ పథకాలు

**షెడ్యూల్డ్ కులాల సంక్షేమం కోసం కేంద్రంలో 1998 లో సామాజిక న్యాయ మంత్రిత్వశాఖను ఏర్పాటు చేశారు. ప్రస్తుత మంత్రి తవార్‌చంద్ గెహ్లాట్. 1979 నుంచి ఎస్సీ ఉపప్రణాళికలో భాగంగా వనరులను కేటాయిస్తున్నారు. దారిద్ర్యరేఖకు దిగువన ఉన్న వారి ఉపాధి కోసం 1989 లో జాతీయ షెడ్యూల్డ్ కులాల ఆర్థికాభివృద్ధి కార్పొరేషన్‌ను స్థాపించారు. ఎస్సీ బాల, బాలికలకు వసతి గృహాలను స్థాపించడానికి 2008 లో బాబూ జగ్జీవన్‌రామ్ ఛాత్రవాస్ యోజనను ప్రారంభించారు.**

ప్రభుత్వం వెనుకబడిన కులాల అభివృద్ధి కోసం కింది ప్రోత్సాహకాలను, పథకాలను ప్రారంభించింది.

★ రాజీవ్ గాంధీ నేషనల్ ఫెలోషిప్స్ - 2005

★ ఎస్సీ బాలికల అక్షరాస్యతా అభివృద్ధి పథకం - 2003

★ పారిశుద్ధ్య కార్మికులకు ఉచిత విద్యా పథకం - 2003

★ పారిశుద్ధ్య కార్మికుల సంక్షేమానికి పార్లమెంట్‌లో స్థాయీ సంఘం - 1998

### షెడ్యూల్డ్ తెగల సంక్షేమ పథకాలు

షెడ్యూల్డ్ తెగల సంక్షేమం కోసం 1999 లో గిరిజన వ్యవహారాల మంత్రిత్వశాఖను ఏర్పాటు చేశారు. ప్రస్తుత మంత్రి జూయల్ ఓరమ్. గిరిజన సంక్షేమం కోసం ఎస్టీ ఉపప్రణాళికను 1974 నుంచి అమలు చేస్తున్నారు.

★ విద్యాభివృద్ధి కోసం ఏకలవ్య మోడల్ రెసిడెన్షియల్ స్కూల్స్ (2006), కస్తూర్బా గాంధీ విద్యాలయాలు (2007), కస్తూర్బా పాఠశాలలు (2004), రాజీవ్‌గాంధీ నేషనల్ ఫెలోషిప్ పథకాలను అమలు చేస్తున్నారు.

★ గిరిజన ఉత్పత్తుల మార్కెటింగ్ కోసం జాతీయ గిరిజన సహకార మార్కెటింగ్ అభివృద్ధి సమాఖ్య (1987) కృషి చేస్తుంది.

★ దారిద్ర్యరేఖకు దిగువన ఉన్న ఎస్టీల సంక్షేమం, స్వయం ఉపాధికి జాతీయ షెడ్యూల్డ్ తెగల ఆర్థికాభివృద్ధి సంస్థ (2001) కృషి చేస్తుంది. వీరి హక్కుల పరిరక్షణకు గిరిజన సలహా మండళ్లు (2013) ఏర్పడ్డాయి.

### ఇతర వెనుకబడిన తరగతులు

★ వెనుకబడిన తరగతుల సంక్షేమాన్ని కేంద్ర సామాజిక న్యాయ మంత్రిత్వ శాఖ పర్యవేక్షిస్తుంది (కేంద్ర సంక్షేమ మంత్రిత్వశాఖ (1985) పేరు మార్చి, 1998 లో దీన్ని ఏర్పాటు చేశారు.)

★ కేంద్ర సంక్షేమ మంత్రిత్వశాఖ ఆధ్వర్యంలో 1992 జనవరి 13 న జాతీయ వెనుకబడిన తరగతుల అభివృద్ధి సంస్థ ఏర్పాటైంది. దారిద్ర్యరేఖకు దిగువన ఉన్న, వెనుకబడిన తరగతుల వారికి రాష్ట్ర సంస్థల ద్వారా రుణాలను మంజూరు చేయడం దీని ప్రధాన లక్ష్యం.

★ ఇతర వెనుకబడిన తరగతుల్లో (ఓబీసీల్లో) వార్షికాదాయం రూ. 6 లక్షలు మించిన వారిని సంపన్న శ్రేణి (క్రీమీలేయర్)గా పరిగణిస్తారు. గతంలో రూ. 4.5 లక్షల వార్షికాదాయం కంటే ఎక్కువ కలిగిన వారిని క్రీమీలేయర్‌గా పరిగణించేవారు. అయితే ఈ పరిమితిని 2013 మే 16 నుంచి రూ. 6 లక్షలకు పెంచడంతో ఎక్కువమంది ఓబీసీలకు రిజర్వేషన్ సదుపాయం కల్పించినట్లయ్యింది.

### మైనారిటీలకు చట్టపర రక్షణలు

★ దర్గా ఖ్వాజాసాహెబ్ చట్టం - 1995

★ దేశంలోని వక్ఫ్‌ల పాలనకు సంబంధించి కేంద్ర ప్రభుత్వానికి సలహాలు ఇవ్వడానికి 1964 లో కేంద్ర వక్ఫ్ మండలిని ఏర్పాటు చేశారు.

★ మైనారిటీల్లో పేదవారి విద్యాభివృద్ధి కోసం మౌలానా ఆజాద్ ఎడ్యుకేషన్ ఫౌండేషన్‌ను 1989 లో ఏర్పాటు చేశారు.

★ జాతీయ మైనారిటీల ఆర్థికాభివృద్ధి సంస్థను 1994 లో ఏర్పాటు చేశారు.

★ మత, భాషా సంబంధ మైనారిటీలపై 2004 లో రంగనాథ్ మిశ్రా కమిషన్‌ను ఏర్పాటు చేశారు.

★ ముస్లిం మైనారిటీల సంక్షేమం కోసం 2005 మార్చి 9 న రాజేంద్ర సింగ్ సచార్ కమిటీని నియమించారు. కేంద్ర ప్రభుత్వం ఈ కమిటీ సిఫారసులను 2007 లో ఆమోదించింది.

★ రాజేంద్ర సింగ్ సచార్ కమిటీ సిఫారసుల ఆధారంగా అప్పటి ప్రధాని మన్మోహన్ సింగ్ 2006 సెప్టెంబరు 10 న 15 సూత్రాల కార్యక్రమాన్ని ప్రారంభించారు.

★ మైనారిటీల సంక్షేమం కోసం 2006 లో కేంద్రంలో మైనారిటీ వ్యవహారాల మంత్రిత్వ శాఖను ఏర్పాటు చేశారు. ప్రస్తుత మంత్రి ముఖ్తార్ అబ్బాస్ నఖ్వీ.

**జాతీయ షెడ్యూల్డ్ కులాల కమిషన్**

రాజ్యాంగంలోని 338 ప్రకరణం ప్రకారం ఎస్సీ, ఎస్టీల ప్రయోజనాలను కాపాడటానికి రాష్ట్రపతి ఒక అధికారిని నియమించవచ్చు. దీని ప్రకారం 1950 నవంబరు 18 న అప్పటి రాష్ట్రపతి మొదటిసారిగా ఎస్సీ, ఎస్టీ కమిషనర్‌ను నియమించారు. 1978 లో జనతా ప్రభుత్వం కమిషనర్ స్థానంలో ఎస్సీ, ఎస్టీ కమిషన్‌ను ఏర్పాటు చేసింది. దీని మొదటి అధ్యక్షుడు బోలా పాశ్వాన్‌శాస్త్రి.

★ 1990 లో 65 వ రాజ్యాంగ సవరణ చట్టం ద్వారా దీనికి రాజ్యాంగ ప్రతిపత్తి కల్పించారు. ఇది 1992 మార్చి 12 నుంచి అమల్లోకి వచ్చింది. దీని మొదటి అధ్యక్షుడు ఎస్. హెచ్. రామ్‌ధన్.

★ 2003 లో అప్పటివరకు ఉన్న ఉమ్మడి ఎస్సీ, ఎస్టీ కమిషన్‌ను రెండుగా విభజించి, జాతీయ ఎస్సీ కమిషన్‌ను, జాతీయ ఎస్టీ కమీషన్‌ను ఏర్పాటు చేశారు. దీనికి అనుగుణంగా ప్రకరణం 338 ప్రకారం 2004 ఫిబ్రవరి 19 న నూతన ఎస్సీ కమిషన్ ఏర్పడింది.

★ ప్రకరణం 338 ప్రకారం పార్లమెంట్ చట్టం ద్వారా నిర్ణయించిన సంఖ్యలో కమిషన్‌లో ఛైర్మన్, వైస్ ఛైర్మన్, ముగ్గురు ఇతర సభ్యులు ఉంటారు (ఒక మహిళా సభ్యురాలు తప్పక ఉండాలి.)

★ అధ్యక్షుడు, ఇతర సభ్యులు రాష్ట్రపతి సంతకం, ముద్రతో నియమితులవుతారు. వీరి అర్హతలను రాష్ట్రపతి నిర్ణయిస్తారు. వీరి పదవీకాలం 3 సంవత్సరాలు. వీరు తమ రాజీనామాను రాష్ట్రపతికి సమర్పించాలి. వీరిని తొలగించే అధికారం రాష్ట్రపతికి మాత్రమే ఉంటుంది. కమిషన్ తన నివేదికను రాష్ట్రపతికి సమర్పిస్తుంది. కమిషన్‌కు సివిల్ కోర్టు హోదా ఉంటుంది. ఎస్సీలకు సంబంధించిన అంశాలపై కేంద్రానికి తగిన సలహాలు ఇవ్వడం ఈ కమిషన్ ముఖ్య విధి.

★ ఎస్సీ కమిషన్ తొలి ఛైర్మన్ సూరజ్‌భాన్. ప్రస్తుత ఛైర్మన్ పి.ఎల్. పూనియా.

**జాతీయ షెడ్యూల్డ్ తెగల కమిషన్**

2003 లో 89 వ రాజ్యాంగ సవరణ చట్టం ద్వారా ఎస్టీలకు ఒక ప్రత్యేక కమిషన్ ఏర్పాటుకు వీలు కల్పించారు. రాజ్యాంగంలో 338 (A) ప్రకరణ ఎస్టీ కమిషన్ ఏర్పాటు చేయడానికి వీలు కల్పించింది. ఇది 2004 ఫిబ్రవరి 19 న ఏర్పడింది. (ప్రకరణం తప్ప నిర్మాణం, విధులు, అధికారాల్లో ఎస్సీ, ఎస్టీ కమిషన్‌లు సారూప్యతను కలిగి ఉంటాయి.)

★ ఎస్టీ కమిషన్ మొదటి ఛైర్మన్ కున్వర్ సింగ్.

★ ప్రస్తుత ఛైర్మన్ రామేశ్వర్ ఓరాన్.

**జాతీయ వెనుకబడిన తరగతుల కమిషన్**

ఇందిరా సహాని కేసులో (1992) సుప్రీం కోర్టు ఇచ్చిన ఆదేశం ప్రకారం ప్రకరణ 340 ఆధారంగా 1992 లో పార్లమెంట్ ఒక చట్టం ద్వారా జాతీయ వెనుకబడిన తరగతుల కమిషన్‌ను ఏర్పాటు చేసింది. కాబట్టి ఇది చట్టబద్ధమైంది. ఇది 1993 ఏప్రిల్ 2 నుంచి అమల్లోకి వచ్చింది.

★ ఇందులో ఛైర్మన్, వైస్ ఛైర్మన్, నలుగురు సభ్యులుంటారు. సుప్రీం కోర్టు లేదా హైకోర్టు మాజీ న్యాయమూర్తి ఛైర్మన్‌గా వ్యవహరిస్తారు. ఇతర సభ్యులకు సంబంధిత రంగాల్లో అనుభవం ఉండాలి. వీరిని కేంద్ర ప్రభుత్వం నియమిస్తుంది. పదవీకాలం 3 సంవత్సరాలు. తమ రాజీనామాను కేంద్ర ప్రభుత్వానికి సమర్పించాలి. వీరిని తొలగించే అధికారం కూడా కేంద్ర ప్రభుత్వానికే ఉంటుంది. కమిషన్ తన నివేదికను కేంద్ర ప్రభుత్వానికి సమర్పిస్తుంది. ఓబీసీలకు సంబంధించి కేంద్రానికి తగిన సూచనలు చేయడం వీరి ప్రధాన విధి. ఈ కమిషన్ మొదటి ఛైర్మన్ జస్టిస్ ఆర్.ఎన్. ప్రసాద్. ప్రస్తుత ఛైర్మన్ - జస్టిస్ వి.ఈశ్వరయ్య.

**జాతీయ మైనారిటీ కమిషన్**

కేంద్ర ప్రభుత్వం 1978 డిసెంబరు 12 న జాతీయ మైనారిటీ కమిషన్‌ను ఏర్పాటు చేసింది. దీనికి 1992 లో పార్లమెంట్ చట్టం ద్వారా చట్టప్రతిపత్తి కల్పించారు. ఇది 1993 మే 17 నుంచి అమల్లోకి వచ్చింది.

★ కమిషన్‌లో ఛైర్మన్, ఉపఛైర్మన్, అయిదుగురు సభ్యులుంటారు. అధ్యక్షుడితో సహా అందరూ అల్ప సంఖ్యాక వర్గాలవారై ఉండాలి. వీరిని కేంద్రం నియమిస్తుంది. పదవీకాలం 3 సంవత్సరాలు. వీరు రాజీనామా పత్రాన్ని కేంద్ర ప్రభుత్వానికి సమర్పించాలి. తొల

గించే అధికారం కూడ కేంద్రప్రభుత్వానికే ఉంటుంది. ఈ కమిషన్ తన నివేదికను కేంద్రానికి సమర్పిస్తుంది. మైనారిటీల అభివృద్ధికి కృషి చేయడం, కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాలు మైనారిటీల కోసం అమలుచేస్తున్న పథకాలను సమీక్షించడం ఈ కమిషన్ ప్రధాన విధి.

★ కమిషన్ మొదటి ఛైర్మన్ ఎం.ఆర్ మసానీ. ప్రస్తుత ఛైర్మన్ నసీమ్ అహ్మద్.

## జాతీయ మహిళా కమిషన్

రాజ్యాంగపరంగా, చట్టపరంగా మహిళలకు కల్పించిన రక్షణలను పర్యవేక్షించడానికి 1992 జనవరి 31 న జాతీయ మహిళా కమిషన్ ఏర్పాటైంది. ఇది చట్టబద్ధమైన సంస్థ.

★ ఈ కమిషన్‌లో అధ్యక్షురాలు, అయిదుగురు సభ్యులు, ఒక మెంబర్ సెక్రటరీ ఉంటారు. వీరిని కేంద్ర ప్రభుత్వం నియమిస్తుంది. పదవీకాలం మూడేళ్లు. వీరిని తొలగించే అధికారం కూడా కేంద్ర ప్రభుత్వానికే ఉంటుంది. రాజీనామా పత్రాన్ని కేంద్ర ప్రభుత్వానికే సమర్పించాలి. ఈ కమిషన్ నివేదికను కేంద్ర ప్రభుత్వానికి సమర్పిస్తుంది.

★ ఈ కమిషన్‌కు సివిల్ కోర్టు హోదా ఉంటుంది. మహిళలకు సంబంధించిన రక్షణలను పర్యవేక్షించడం, మహిళా సంక్షేమానికి సంబంధించి కేంద్ర ప్రభుత్వానికి తగిన సలహాలు ఇవ్వడం ఈ కమిషన్ ప్రధాన విధులు.

★ జాతీయ మహిళా కమిషన్ మొదటి అధ్యక్షురాలు జయంతి పట్నాయక్.

★ ప్రస్తుత అధ్యక్షురాలు లలితా కుమార మంగళం.

## మహిళలకు చట్టపరమైన రక్షణలు సంక్షేమ పథకాలు

| | | | |
|---|---|---|---|
| ★ సతీసహగమన నిషేధ చట్టం | - 1829 | ★ డ్వాక్రా పథకం | - 1982 |
| ★ వితంతు పునర్వివాహ చట్టం | - 1856 | ★ కుటుంబ కౌన్సెలింగ్ కేంద్రాలు | - 1984 |
| ★ బాల్యవివాహాల నిరోధ చట్టం | - 1952 | ★ మహిళా సమృద్ధి యోజన పథకం | - 1993 |
| ★ ప్రత్యేక వివాహ చట్టం | - 1954 | ★ ఇందిరా మహిళా యోజన పథకం | - 1995 |
| ★ హిందూ వివాహ చట్టం | - 1955 | ★ స్వాధార్ గృహ పథకం | - 2001 |
| ★ వరకట్న నిషేధ చట్టం | - 1961 | ★ ఇందిరాగాంధీ మాతృత్వ సహయోగ్ యోజన | - 2010 |
| ★ సమాన వేతన చట్టం | - 1976 | ★ జననీ సురక్ష యోజన | - 2005 |
| ★ మహిళల అమర్యాదకర వర్ణన నిరోధక చట్టం | - 1986 | ★ కేంద్ర మహిళా శిశు సంక్షేమ శాఖ | - 2006 |
| ★ గృహహింస నిరోధక చట్టం | - 2005 | ★ ఉజ్వల పథకం | - 2007 |
| ★ పనిప్రదేశంలో వేధింపులకు వ్యతిరేకంగా రక్షణ చట్టం | - 2013 | ★ స్వయం సిద్ధ | - 2007 |
| ★ నిర్భయ చట్టం | - 2013 | | |
| ★ మహిళా ఉపాధి శిక్షణ మద్దతు పథకం | - 1986 | ★ మహిళా సాధికారత జాతీయమిషన్ | - 2010 |

రచయిత: **షేక్ పీర్ సాహెబ్**